వైఎస్ఆర్ కడప వార్త
తెలుగు జాతీయ దినపత్రిక
సోమవారం 20 ఏప్రిల్ 2026



# ఊగిసలాడుతున్న పసుపు ధర...

**దువ్వూరు, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:**

పశ్చిమ ఆసియా యుద్ధం ప్రభావం వల్ల గతంలో కొద్ది మేర ధర తగ్గిన పసుపు యుద్ధ వాతావరణం చల్లబడిన తర్వాత తిరిగి ఊపందుకుంది. అయితే గత రెండు, మూడు రోజులుగా పసుపు ధర అటు ఇటు ఊగిసలాడుతుండటంతో పసుపు రైతులు ఆందోళన చెందుతున్నారు. దువ్వూరు మండలంలో సుమారు 800 ఎకరాల్లో పసుపు పంటను సాగు చేశారు. దువ్వూరు, కానగూడూరు, కృష్ణం పల్లె, ఇడమడక, మూడిల్ల పల్లె తదితర గ్రామాల్లో పసుపు పంట దిగుబడులు పూర్తి కావస్తున్నాయి. ప్రస్తుతం ఉడకబెట్టి ఎండకు ఆరవేస్తున్నారు. వారం, పది రోజుల్లో మార్కెట్ కు తరలించేందుకు సిద్ధమవుతున్నారు. 15 రోజుల క్రితం 100 కేజీలు క్వింటాల్ ధర 13700 పలకగా ప్రస్తుతం 1500 తగ్గి 12 వేల రూపాయల వద్ద ఉంది. కొద్ది రోజుల క్రితం కొద్ది మేర పెరిగి మరీ తగ్గడంతో పసుపు రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతుంది. అలాగే కడప మార్కెట్ యార్డ్ నందు పసుపు విక్రయాలు ఎక్కువగా జరుగుతుంటాయి. అక్కడ నిల్వలు పేరుకు పోవడంతో పసుపు రైతుల్లో పసుపును విక్రయించాలనుకునే వారు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం 12000 నుంచి 12,500 వరకు ధర పలుకుతుందని తెలిపారు. అయితే విత్తనం పసుపు ధర స్థిరంగా ఉంది. పుట్టి ధర 7వేల నుంచి 7500 రూపాయల వరకు విక్రయిస్తున్నారు. ఎండు పసుపును విక్రయించుకునేందుకు కడపలో సరైన మార్కెట్ సౌకర్యాలు కల్పించాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు. రోజు మార్చి రోజు మాత్రమే అక్కడ కొనుగోలు చేస్తున్నారని అందువల్ల తమకు ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కడప మార్కెట్ యార్డులో పసుపు నిల్వలు ఎక్కువగా ఉండటంతో వాటిని తరలించిన తర్వాతనే రైతులు సరుకును తీసుకురావాలని తెలపడంతో రైతులు కొద్దిగా ఆందోళనకు గురవుతున్నారు. ఏ రోజుకు ఆరోజు విక్రయాలు జరిగితే మార్కెట్ యార్డులో పసుపు రైతులకు ఊరట కలుగుతుందని చెప్పవచ్చు.



# గాలేరు నగరి ప్రాజెక్టు పూర్తికి సమగ్ర ప్రాజెక్టు నివేదిక

**రాజంపేట, ఏప్రిల్ 19 ప్రభాతవార్త**

గాలేరు నగరి సుజల స్రవంతి ప్రాజెక్టును పాత కడప జిల్లాలో పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జిఎన్ఎస్ ఫేస్ 1 ప్రారంభమయ్యే చోటు నుంచి 240 కిలోమీటర్ల వరకు ప్రధాన కాలు వతో పాటు మిగతా పనులు పూర్తి చేసేందుకు సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక (డి పి ఆర్)సిద్ధం చేయాలని జల వనరుల శాఖను ఆదేశించింది.అధికారులు దీనికి సంబంధించిన నివేదికలను సిద్ధం చేసే పనుల్లో నిమగ్న మయ్యారు. ఏడాదిలోగా కడప వరకు జిఎన్ఎస్ నీరు ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ ఇచ్చిన విషయం తెలిసింది. ఈ హామీని నెరవేర్చడంతో పాటు జిఎన్ఎస్ఎస్ ప్రాజెక్టు పూర్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వ పథకమైన పూర్వోదయ నిధుల కోసం రాష్ట్రం ప్రయత్నిస్తోంది. ఇప్పటికే జల వనరుల శాఖ అధికారులు జిఎన్ఎస్ఎస్ ప్రధాన కాలువ ప్రారంభమయ్యే చోటు నుంచి రెండో దశ వరకు ఏడవ ప్యాకేజ్ ప్రస్తుతం తిరుపతి జిల్లా సెట్టిగుంట వరకు పనులు పూర్తి కావాలంటే సుమారు 6000 కోట్లు అవసరమని ప్రిలిమినరీ రిపోర్టు పంపారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నివేదికను కేంద్ర జల సంఘానికి( సి డబ్ల్యూ సి) కి పంపింది. ఈ నివేదిక పరిశీలించిన తర్వాత సమగ్ర ప్రాజెక్టు నివేదిక డిపిఆర్ పంపాలని ఆదేశాలు అందాయి. ఈ మేరకు పూర్తిస్థాయిలో నివేదికలను సిద్ధం చేస్తున్నారు. ఎంతవరకు పనులు జరిగాయి, ఇంకా ఏ మేరకు పనులు చేయాలి ,ఆ వివరాలు ,భూసేకరణ పనులు, అటవీశాఖ అనుమతులు మొత్తం నివేదికను సిద్ధం చేస్తున్నారు. పక్కా నివేదికను సిద్ధం చేసిన తర్వాతనే డిపిఆర్ కోసం టెండర్లు పిలిచే అవకాశం ఉంది. రెండో దశ పనులు 10శాతం కూడా జరగలేదు. కొన్నిచోట్ల పను లు అసలు ప్రారంభం కాలేదు. ఇకపోతే అన్నమయ్య ప్రాజెక్టు పునర్ నిర్మాణానికి కూడా డిపిఆర్ సిద్ధం చేయమని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు జిల్లా జలవనరుల శాఖ అధికారులకు ఆదేశాలు అందాయి. గతంలో డిపిఆర్ ఉన్నప్పటికీ ప్రాజెక్టు పునర్ నిర్మాణం విషయంలో ఊహించని మార్పులు జరిగాయి. గతంలో అన్నమయ్య ప్రాజెక్టులు కాంక్రీట్ డాం కట్టాలని ఒక దశలో సిద్ధమైనా నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకు ఆ ప్రతిపాదన పక్కన పెట్టారు. ప్రస్తుతం కోర్ వాల్ పద్ధతిలో ప్రాజెక్టు నిర్మాణం దాదాపు ఖరారు అయినట్లు తెలుస్తోంది. చెన్నై ఐఐటీ నిపుణులు పరిశీలన అనంతరం అన్నమయ్య ప్రా జెక్టు నీటి విడుదల సామర్థం 4.61 లక్షల క్యూసెక్కులుగా తేల్చారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి నివే దిక పంపారు. ఈ నివేదిక నిపుణుల కమిటీకి నేతృతం వహిస్తున్న రమేష్ కుమార్ తాజా పరిస్థితిలపై ఇటీవల రాష్ట్ర జలవనరుల శాఖా సలహాదారు వెంకటేశ్వర్లు తో చర్చించారు. ఐఐటి నిపుణుల నివేదికతో పాటు అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానం, హైడ్రాలజీ సిఫారసులను పరిగణలోకి తీసుకొని మరో రెండు విధానాల ద్వారా ప్రాజెక్టు నీటి విడుదల సామర్థం సిద్ధం చేయాలని సూచించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు జిల్లా అధికారులు, ప్రాజెక్టు అధికారులు చర్చించారు. సలహాదారుని ఆదేశాల మేరకు డిజైన్లు సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. మరోవైపు నీటి విడుదల సామర్థం ఖరారు చేసే విషయమై సి డబ్ల్యూ సితో చర్చించారు. అలాగే పూణేలోని నేషనల్ వాటర్ అకాడమీ నీ సంప్రదించారు. త్వరలోనే అక్కడికి వెళ్లి స్టాండర్డ్ ప్రాజెక్ట్ ఫ్లడ్ ఖరారు చేయనున్నట్లు ఉన్నత స్థాయి అధికారిక వర్గాలు తెలిసింది.ఎస్ పి ఎఫ్ (స్టాండర్డ్ ప్రాజెక్ట్ ఫ్లడ్)తేలిన తర్వాతనే డిపిఆర్ సిద్ధం చేసేందుకు అవకాశం ఉంటుంది.















# అక్షయ తృతీయ సందర్భంగా అన్నప్రసాదం, మజ్జిగ వితరణ





**బద్వేల్ అర్బన్ ఏప్రిల్ 19 ప్రభాతవార్త :**
అక్షయ తృతీయ మరియు మండుతున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని బోవిల్లవారిపల్లె గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త సానపురెడ్డి రాధాకృష్ణారెడ్డి సహకారంతో ఆదివారం మైదుకూరు రోడ్డు మంచినీటి చలివేంద్రం వద్ద పలువురు ప్రజలకు, బాటసారిలకు, అనాధలకు, అభాగ్యులకు రుచికరమైన భోజనం, స్వీట్ మజ్జిగ వితరణ కార్యక్రమాన్ని వారి కుటుంబ సభ్యుల సహకారంతో ఏర్పాటు చేయడం సంతోష్కరమని మాజీ ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కే,వీ సుబ్బారావు, విద్యావేత్త సి,వి నాగేశ్వరరావు, కొలిశెట్టి సుబ్బారావు, జొన్నలగడ్డ సుధాకర్,పెసల సుధాకర్ తోపాటు పలువురు అన్నారు. పారిశ్రామికవేత్త సానపురెడ్డి రాధాకృష్ణారెడ్డి మానవతా దృక్పథం"తో మండుతున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని మరియు అక్షయ తృతీయ సందర్భంగా పలువురికి అన్న ప్రసాద వితరణ కార్యక్రమం మజ్జిగ వితరణ కార్యక్రమాన్ని నిర్వహించి తన మానవత్వాన్ని చాటుకోవడం అభినందనీయమని వారి సేవలను పలువురు కొనియాడారు, సానుపు రెడ్డి రాధాకృష్ణారెడ్డి ఆధ్యాత్మిక కార్యక్రమాలకే కాకుండా ఆసరా కోల్పోయిన అనేక మందికి సహాయ సహకారాలు అందించడమే కాకుండా అక్షయ తృతీయ పురస్కరించుకొని అన్నప్రసాద కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేయడం వారి గొప్ప మనసుకు పలువురు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు, ఇటీవల జాంబవంత నగర్ కోదండ రామాలయానికి శ్రీ రాములు వారి పంచలోహ విగ్రహానికి వారి వంతు సహాయం అందించడమే కాకుండా బవిల్లవారిపల్లె గ్రామంలో గ్రామ ప్రజలకు ఉచితంగా ఆరో ప్లాంట్ ద్వారా మంచి నీటిని కూడా వారి కుటుంబ సభ్యులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు, సేవా కార్యక్రమాలకు మారుపేరుగా సానపురెడ్డి రాధాకృష్ణారెడ్డి బద్వేల్ ప్రాంతంలో అందిస్తున్న సేవలు సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. రాధాకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులకు స్వామివారి అనుగ్రహం ఉండాలని రాబోవు రోజులలో ఇటువంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేపట్టాలని పలువురు ఆకాంక్షించారు, ఈ కార్యక్రమంలో మునగా వెంకటరమణ ఆర్ఎంపీ డాక్టర్, మరియు పలువురు పాల్గొన్నారు.

## మహిళా బిల్లుపై మోసం చేస్తున్న కేంద్రం



**పులివెందుల, ఏప్రిల్ 19 , ప్రభాత వార్త :**
మహిళా రిజర్వేషన్ బిల్లుపై కేంద్ర ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నదని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవి శంకర్ రెడ్డి విమర్శించారు. పట్టణంలోని స్థానిక గఫూర్ డ్రైవింగ్ స్కూల్ ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2023లోనే మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందినప్పటికీ, ప్రస్తుతం లేని బిల్లును ఉన్నట్లు ప్రచారం చేస్తోందని ఆరోపించారు. డీలిమిటేషన్ బిల్లును మహిళా బిల్లుగా చూపిస్తూ ప్రజలను మోసగించడం బిజెపి ప్రభుత్వానికి మాత్రమే సాధ్యమన్నారు. పార్లమెంటు వేదికగా అబద్ధాలను ప్రచారం చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. ఈ విషయంపై స్పందించాల్సిన రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు టిడిపి, వైసిపి, జనసేనలు కేంద్ర ప్రభుత్వానికి కట్టుబానిస లుగా మారాయని, తప్పును తప్పు అని చెప్పే ధైర్యం రాష్ట్ర నాయకులకు లేకపోవడం విచారకరమని విమర్శించారు. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పిందే సత్యంగా భావిస్తూ పాలన కొనసాగుతుందని, దీనిపై ఎవ్వరూ ప్రశ్నించలేని పరిస్థితి నెలకొన్నదని వ్యాఖ్యానించారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బిజెపి లాభం కోసం అబద్ధపు ప్రచారాలు తెరపైకి తెస్తోందని, ప్రజలు ఈ విషయాలను గమనిస్తు న్నారని ఆయన తెలిపారు. అధికారం శాశ్వతం కాదని, నిజాయితీగా మాట్లాడే నాయకులనే ప్రజలు ఆదరిస్తారని అన్నారు. రంగులు మార్చే రాజకీయా లను ప్రజలు ఎప్పటికైనా తిరస్కరిస్తారని హెచ్చరించా రు. ఈ కార్యక్ర మంలో రామేశ్ రెడ్డి, సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ రాష్ట్రష కార్యదర్శిగా ఎన్నికైన బిర్రు గుర్రప్ప

### - దళిత ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సన్మానం



**జమ్మలమడుగు, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:**
తెదేపా రాష్ట్ర రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన బిర్రు గుర్రప్ప (సంతోష్)ని ఆదివారం స్థానిక దళిత ప్రజా సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు సన్మానించారు. స్థానిక వివేకానంద జూనియర్ కళాశాల ప్రాంగణంలో జరిగిన ఈ వేడుక దళిత నాయకుల కోలాహలం మధ్య నిర్వహించారు. నియోజకవర్గ చరిత్రలో ఒక దళిత బిడ్డకు రాష్ట్ర స్థాయి గుర్తింపు లభించడం తమందరికీ గర్వకారణమని ఐక్యవేదిక నాయకులు ఈ సందర్భంగా కొనియాడారు. సంతోష్ సేవలను గుర్తించి దళితులకు సముచిత గౌరవం కల్పించిన తెదేపా జాతీయ అధ్యక్షులు చంద్రబాబు, యువనేత లోకేష్‌కు, టీడీపీ జిల్లా అధ్యక్షులు భూపేష్‌రెడ్డికి దళితుల పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు జి.జె.సైమన్, కె.దేవదానం, పిచ్చికె బాబు, వై.చిన్నయ్య, పాలాజీ చిన్న వెంకట స్వామి, మంత్రి శీను, తిరుమలయ్య, మోదం నల్లప్ప, మర్రి ప్రకాశం, పొన్నతోట జయచంద్ర, సురేంద్ర, ఓబులేసు, నాగన్న, ఓబయ్య, అవిసె శ్రీనివాసులు, ఆల్‌ఫ్రెడ్, బిర్రు చెన్నయ్య, కొండయ్య, రాజు, పుష్పరాజ్, గురుబాబు, రాజశేఖర్, బి.సురేంద్ర, జె.రవి, వినయ్, వెంకటసుబ్బయ్య, ఎం.శ్రీనివాసులు, అక్షయ్, మోహన్, బద్రి, యునైటెడ్ పాస్టర్ ట్రస్ట్ సురేంద్ర, అభిషేలం, ఆవుల వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉర్దూ పాఠశాలల్లో పిల్లలను చేర్పించండి



**కడప కార్పొరేషన్ ఏప్రిల్ 19 ప్రభాతవార్త:**
ప్రభుత్వ ఉర్దూ పాఠశాలల్లో అన్ని వసతులున్నాయని, ఉచిత భోజనం, ఉచిత పాఠ్యపుకాలు శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో భోధన జరుగుతుందని ఉర్దూవిద్య అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని టిడిపి రాష్ట్ర నాయకులు అమీర్ బాబు అన్నారు. రాష్ట్ర అంజుమన్ తరఖీ ఉర్దూ ఆధ్వర్యంలో ప్రచురించిన కరపత్రాలను కడపలో ఆ సంస్థ కార్యాలయంలో ఆవిష్కరించారు. అంజుమన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హిదాయతుల్లా, అంజుమన్ జిల్లా అధ్యక్షులు నత్తార్ ఫైజి మాట్లాడుతూ మాతృ భాష లో చదివితే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. రాష్ట్రలోని అన్ని జిల్లాలకు ఈ కరపత్రాలు పంపిణీ చేయనున్నారని తెలిపారు. ఉత్తమ ఉర్దూ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహిస్తూనందుకు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి మాజీ జిల్లా అధ్యక్షులు నజీర్ అహ్మద్, అంజుమన్ కార్యవర్గ సభ్యులు అయ్యుబ్, తయ్యబ్, ఐటా నజీర్, సిరాజ్ బొఖారి ఖదీర్ పర్వేజ్‌లు పాల్గొన్నారు.

## సౌమ్యనాథ సేవా ట్రస్ట్ నిధులు రూ.2.51 కోట్లు



**నందలూరు, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :**
శ్రీ సౌమ్యనాథ సేవా ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ ఎద్దుల సుబ్బరాయుడు ఆధ్వర్యంలో ట్రస్ట్ సభ్యుల సమావేశం జరిగింది. 2026 మార్చి 31 నాటికి ట్రస్ట్‌కు వివిధ బ్యాంకుల్లో రూ.2,51,38,720 ఫిక్స్డ్ డిపాజిట్లు ఉన్నట్లు వెల్లడించారు. 2025, 26 సంవత్సరానికి సంబంధించిన అన్నదాన పథకానికి సంబంధించిన జమాఖర్చులను సమీక్షించారు. అనంతరం ఎద్దుల సుబ్బరాయుడు మాట్లాడుతూ సేవాభావంతో భక్తులకు రుచికరమైన అన్నదానం అందించడాన్ని కొనసాగించాలని, వేసవిలో భక్తులకు తాగునీటి సౌకర్యాలు మెరుగుపర్చాలని సూచించారు. సమావేశంలో కోశాధికారి చక్రాల రామసుబ్బన్న, కార్యదర్శి కే శైలేంద్రనాథ్, గంటా వాసుదేవయ్య, పల్లె సుబ్రహ్మణ్యం, జంగం శెట్టి వెంకటసుబ్బయ్య, మోడపోతుల రాము, లంకాయగారి సుబ్బరామయ్య, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్‌ను ముట్టడించిన దళితులు

**ముద్దనూరు.ఏప్రిల్.19 . ప్రభాత వార్త ;**
దళిత యువకుడ్ని పోలీస్‌స్టేషన్లో నిర్బంధించారని దళిత నాయకులు కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించిన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు ఆదివారం సీఐ నగేష్ బాబు ఆధ్వర్యంలో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించిన సందర్భంగా యువకుడు కౌన్సిలింగ్ గైహాజర్ కావడంతో అనంతరం స్టేషన్‌కు పిలిపించి మీపై రౌడీషీట్ ఉన్నప్పుడు పోలీసులకు సహరించాలని, చట్టానికి లోబడి ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సూచించి కుటుంబ సభ్యుల హామీ మేరకు పంపించినట్లు సిఐ నగేష్ బాబు పేర్కొన్నారు. ఎంతటి వారైనా చట్టాలకు విరుద్ధంగా నడుచుకుంటే పోలీస్ యంత్రాంగం కఠిన చర్యలు తీసుకుంటుందని ఈ సందర్భంగా హెచ్చరించారు.



## అగ్నిమాపక వారోత్సవాలు



**సిద్ధవటం ఏప్రిల్ 19 ప్రభాతవార్త**
అగ్నిమాపక వారోత్సవాలు లో భాగంగా 6 వ రోజున రాజంపేట అగ్నిమాపక కేంద్రము నుండి రాజంపేట టౌన్ నందు కరపత్రములు పంచుతూ, అగ్ని ప్రమాదాలు పైన అవగాహన కలిగి ఉండాలని తెలుపుతూ వెళ్లి, అక్కడ నుండి రాజంపేట బ్రిక్ ఏరియా హాస్పిటల్ కి వెళ్లి అక్కడ పని చేస్తున్న సిబ్బందికి, అక్కడ ఉన్న ప్రజలకు రాజంపేట కేంద్రాధికారి పీవీ రాధాకృగ్నాస్ ప్రమాదాలు:1. గ్యాస్ లీక్ అయినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి 2. గ్యాస్ మండుతున్నప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు,ఆర్పే విధానము ఆయిల్ ప్రమాదాలు 3. ఆయిల్ ఫైర్స్ మండుచున్నప్పుడు ఆర్పవలసిన జాగ్రత్తలు గురించి, 4.ఎలక్ట్రిక్ ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించి వారితో డెమో చేయించడమైనది, ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు రాజంపేట అగ్నిమాపక కేంద్రమునకు 08565240299(101) లేదా 9963479554 సమాచారము అందించాలని తెలిపారు, అలాగే అక్కడ పని చేస్తున్న సిబ్బందికి కరపత్రములు ఇవ్వడమైనది, ఈ కార్యక్రమము నందు హాస్పటల్ సూపరిడెంట్ డాక్టర్ లు, సిబ్బంది, ప్రజలు, అగ్నిమాక సిబ్బంది పాల్గొన్నారు.

## కటిక వీధిలో, మేకల దొడ్డిలో వీధిలైట్లు ఏర్పాటు

**కడప కార్పొరేషన్ ఏప్రిల్ 19 ప్రభాతవార్త:**



కడప నగరంలోని 28 డివిజన్ లో నీ కటిక వీధిలో వీధిలైట్లు మరమ్మత్తు చేయించామని 28 వ డివిజన్ తెలుగుదేశం యువ నాయకులు బి. అబ్దుల్లా తెలిపారు. వీధిలైట్లకు మరమ్మతులు, కొత్త లైట్లు చేయించామని తెలిపారు. అలాగే మేకల దొడ్డి వద్ద నిత్యం ప్రజలు రద్దీగా ఉన్న ప్రాంతమని అటువంటి ప్రాంతంలో విద్యుత్ దీపం లేక చీకటిగా ఉండడంతో ఆ ప్రాంతంలో చాలా మంది అల్లరి మూకలు గంజాయి సేవించి అర్ధరాత్రి వరకు తిరుగుతున్నారన్న ప్రజల అభిప్రాయం మేరకు వీధిలైట్లు ఏర్పాటు చేశామని చెప్పారు.

# ఆరోగ్య కేంద్రంలో అగ్నిమాపక సిబ్బంది పలు సూచనలు





**మైదుకూరు, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:**
అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆదివారం అగ్నిమాపక కేంద్రం అధికారి ఎస్.అన్వర్ భాష, ఆధ్వర్యంలో మైదుకూరు అగ్నిమాపక సిబ్బంది అగ్నిమాపక వాహనం తో వెళ్లి నంద్యాల రోడ్డు సామాజిక ఆరోగ్య కేంద్రం (మైదుకూరు గవర్నమెంట్ హాస్పిటల్) నందు చేరుకొని కరపత్రాలు పంచుతూ అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు సురక్షి తంగా రక్షించుకోవడానికి పరికరాలు ఎలా వాడాలి మరియు రెస్క్యూ మెథడ్స్, అత్యవసర సమయంలో ఊపిరి సరిగ్గా లేనప్పుడు గుండె ఆగినప్పుడు సి.పి.ఆర్ ప్రయోగపూర్వకంగా చేసి సిబ్బందికి అక్కడ ఉన్న ప్రజలకు ఉపయోగపడేలా చూపించడమైనది. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్. కరీముల్లా, నర్సులు కాంపౌండర్లు, పేషెంట్లు, ప్రజలు మరియు అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉంటే

# దొంగతనాలకు అడ్డుకట్ట

**రాజంపేట ,ఏప్రిల్ 19 ప్రభాతవార్త**
గ్రామాలను ప్రజలు అప్రమత్తంగా ఉంటే దొంగతనాలు అరికట్టవచ్చని మన్నూరు సిఐ లింగప్ప పేర్కొన్నారు. ఆదివారం జిల్లా ఎస్.పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు దొంగతనాలను అరికట్టేందుకు మన్నూరు పోలీసులు తాళ్లపాకలో పిల్లలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా మన్నూరు సి.ఐ లింగప్ప మాట్లాడుతూ ఇంటికి తాళాలు వేసి వెళ్ళేటపుడు సమీప పోలీస్ స్టేషన్ లో సమాచారం ఇవ్వాలని సూచించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడం వల్ల ఇంటిపై నిఘా ఉంచడం జరుగుతుందన్నారు. బంగారు, వెండి తదితర విలువైన వస్తువులను బ్యాంక్ లాకర్ లలో భద్రపరచుకోవడం వల్ల దొంగతనానికి ఆస్కారం ఉండదన్నారు. ఇతర ఊర్లకు వెళ్ళేటపుడు పోలీస్ శాఖ ఉచితంగా అందిస్తున్న ఎల్.హెచ్.ఎం.ఎస్ ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలు బహిరంగ ప్రదేశాలలో వెళ్ళేటపుడు అప్రమత్తం గా ఉండాలని సూచించారు. చోరీల నిరోధానికి వీలయిన వారు ఇంటి వద్ద సి.సి కెమెరాలు అమర్చుకోవాలని మన్నూరు సి.ఐ లింగప్ప తెలిపారు.

## చేనేత గుర్తింపు కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి ఉచిత విద్యుత్ అందించాలి

**సిద్ధవటం ఏప్రిల్ 19 ప్రభాతవార్త**



చేనేత మగ్గం పనులపై ఆధార పడి చేనేత గుర్తింపు కార్డు కలిగి చేనేత అనుబంధ పనులు చేసుకుని జీవిస్తున్న వివిధ విభాగాల కార్మికులకు కూడా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని వర్తింపజేయాలని రాష్ట్ర పద్మశాలి సంక్షేమ సంఘం యువజన విభాగం కార్యదర్శి అవ్వారు రవిశంకర్ కోరారు. సిద్ధవటం మండలం మాధవరం1 గ్రామంలో ఆదివారం జరిగిన ఒక కార్యక్రమంలో ఈ విజ్ఞప్తి చేశారు. మగ్గం పని కాకుండా అచ్చులు అతకడం, వార్పులు చుట్టడం, పడుగులు చేయడం, బాబిన్లు చుట్టడం, రంగులు అద్దడం వంటి చేనేత అనుబంధ పనులు చేసే కార్మికుల కష్టాలను కూడా ప్రభుత్వం గుర్తించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. చేనేత కార్మికులకు 200 యూనిట్లు పవర్ లూమ్ మగ్గాలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ అందించడంపై హర్షం వ్యక్తం చేస్తూనే, అదే స్థాయిలో అనుబంధ కార్మికులకు కూడా ఈ ప్రయోజనం చేకూరేలా చేనేత జౌళి శాఖ మరియు విద్యుత్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని పలువురు చేనేత అనుబంధ విభాగాల కార్మికులు ఇతర చేనేత కార్మికులు పాల్గొని చేనేత గుర్తింపు కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అందించాలని లేదంటే వచ్చే స్థానిక ఎన్ని కలలో కూటమి ప్రభుత్వానికి చేనేత కార్మికులు మద్దతు పలకరని హెచ్చరించారు.

## జాతీయ రహదారి కబ్జాదారులకు

# వరమా? విచారణకు డిమాండ్



**బద్వేలు ,ఏప్రిల్ 18, ప్రభాతవార్త**
నియోజకవర్గంలోని గోపవరం మండలంలో జాతీయ రహదారి ఏర్పాటు, ఇండస్ట్రియల్ ఏరియా ప్రకటనతో అక్రమ కబ్జాలు పెరిగాయని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యుడు చంద్రశేఖర్ ఆరోపించారు. శనివారం పార్టీ బృందంతో కలిసి కబ్జా భూములను పరిశీలించిన ఆయన, ప్రభుత్వ భూములు, వంకలు, చెరువులు, కాలువలు అక్రమంగా ఆక్రమించబడుతున్నాయని తెలిపారు. గత రెండు సంవత్సరాలుగా జరిగిన కబ్జాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, సంబంధిత రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2024లో రెవెన్యూ అధికారులే తొలగించిన ఫెన్సింగ్‌లు ప్రస్తుతం మళ్లీ ఎలా ఏర్పడ్డాయో వివరణ ఇవ్వాలని ప్రశ్నించారు. భూముల ధరలు పెరగడంతో అక్రమార్కులు విస్తృతంగా ఆక్రమణలకు పాల్పడుతున్నారని, రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. కబ్జాదారులపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ పర్యటనలో పార్టీ నాయకులు జకరయ్య, రామరాజు, జయరామరాజు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్య కార్డియాక్‌లో ఉచిత వైద్య శిబిరం

**ప్రొద్దుటూరు అర్బన్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త**



ప్రతి నెల మూడవ ఆదివారం నాడు ప్రొద్దుటూరు పట్టణంలో ఉన్న లక్ష్య హాస్పిటల్ నందు పేద ప్రజల కోసం ఉచిత కంటి, గుండె జబ్బుల వైద్య శిబిరం నిర్వహిస్తామని డాక్టర్ పాతకోట శ్రీనాథ్ రెడ్డి, డాక్టర్ హరిత తెలిపారు. ఆదివారం 60 వ ఉచిత వైద్య శిబిరం నిర్వహించి డాక్టర్ పాతకోట శ్రీనాథ్ రెడ్డి 42 మంది రోగులను ఉచితంగా పరీక్షించి వీరిలో 22 మందికి ఉచితంగా ఇసిజి మరియు 8 మందికి ఉచితంగా గుండె స్కానింగ్ చేసి రోగులకు తగు చికిత్స, సూచనలు ఇచ్చారు. డాక్టర్ హరిత 34 మంది రోగులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, వారికి తగు చికిత్స, సూచనలు అందించారు.

## లారీలో మంటలు తప్పిన ప్రమాదం



**ముద్దనూరు. ఏప్రిల్ 19 ప్రభాతవార్త**
మండలం పరిధి జమ్మలమడుగు జాతీయ రహదారి శివాలయం సమీపంలో ఆదివారం దాల్మియా సిమెంట్ కర్మాగారం నుంచి సిమెంటు లోడుతో బెంగళూరుకు వెళ్తున్న లారీలో అకస్మాత్తుగా ఇంజన్ భాగం నుంచి మంటలు చెలరేగి లారీ ముందు భాగం అంతా పూర్తిగా కాలిపోయిన ఘటన చోటుచేసుకుంది. లారీ డ్రైవర్ అప్రమత్తతో జమ్మలమడుగు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని ఫైర్ సిబ్బంది చంద్రశేఖరప్ప ఆధ్వర్యంలో మంటలను అదుపు చేసినట్లు తెలిపారు. ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం చోటు చేసుకోలేదన్నారు. ఉష్ణోగ్రత అధికంగా ఉండడంతో వాహనదారులు జాగ్రత్తలు చేపట్టి ప్రయాణించాలని ఫైర్ సిబ్బంది సూచించారు.

## పవన్ కళ్యాణ్‌కు శస్త్రచికిత్స

# త్వరగా కోలుకోవాలని ప్రార్థనలు

### జనసేన పార్టీ నేత దాసరి రవిశంకర్

**వేంపల్లె:ఏప్రిల్ 19 ప్రభాతవార్త**



జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అనారోగ్యానికి గురైనట్లు సమాచారం. శుక్రవారం అధికారులతో పాలనాపరమైన అంశాలపై సమీక్ష నిర్వహిస్తున్న సమయంలో అకస్మాత్తుగా అస్వస్థతకు గురైనట్లు తెలిసింది. వైద్యుల సూచన మేరకు శనివారం శస్త్రచికిత్స నిర్వహించినట్లు పులివెందుల నియోజకవర్గ జనసేన పార్టీ నేత దాసరి శంకర్ తెలిపారు. ఈ విషయం తెలిసి వ్యక్తిగతంగా ఆందోళనకు గురైనట్లు ఆయన పేర్కొన్నారు. గండి క్షేత్రంలోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని ప్రార్థించినట్లు తెలిపారు. పవన్ కళ్యాణ్ కేవలం రాజకీయ నాయకుడు మాత్రమే కాకుండా లక్షలాది మందికి ఆశాకిరణమని, ఆయన ఆరోగ్యం త్వరగా మెరుగుపడాలని ప్రతి జనసేన కార్యకర్త, మహిళలు ప్రార్థనలు చేస్తున్నారని తెలిపారు. ఆయన త్వరగా కోలుకుని మరింత దృఢ సంకల్పంతో ప్రజాసేవలో కొనసాగాలని దాసరి రవిశంకర్ ఆకాంక్షించారు.

## గౌతు లచ్చన్న ఘన నివాళులు

**నందలూరు, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :**
స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న 20వ వర్ధంతి సందర్భంగా నందలూరులో ఘనంగా నివాళులు అర్పించారు. నందలూరు వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అరవపల్లి బచ్చు భవన్‌లో నిర్వహించిన కార్యక్రమానికి విభా ఎరుడైట్ స్కూల్ చైర్మన్ డాక్టర్ జయ భాస్కరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వాతంత్ర్య పోరాటంలో ప్రజలను సమీకరించి బ్రిటిష్ పాలనకు సవాల్ విసిరిన మహనీయుడు లచ్చన్న అని కొనియాడారు. అటువంటి నాయకుల సేవలను స్మరించుకోవడం సమాజ బాధ్యత అని పేర్కొన్నారు. ఎస్పి మన్నెం రామమోహన్ మాట్లాడుతూ, లచ్చన్న గారు ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో ప్రజాప్రతినిధిగా, అనంతరం మంత్రిగా, పార్లమెంటేరియన్‌గా సేవలందిస్తూ ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం సాగించారని తెలిపారు. గురువు ఆచార్య ఎన్జీ రంగాపై గౌరవంతో ఎంపీ పదవికి రాజీనామా చేసి ఆయనను ఎంపీగా చేయడం ఆయన నిస్వార్థ రాజకీయాలకు నిదర్శనమని చెప్పారు. కార్యక్రమంలో లయన్ కుర్రా మణి యాదవ్, భూశెట్టి వెంకటసుబ్బయ్య, ఉప్పు శెట్టి సుధీర్, మోడపోతుల రాము, గంధం గంగాధర్, మంటి మారయ్య, పాటూరు రమేష్, త్యాగరాజు, జయచంద్ర, హేమంత్, రవితేజ, కళ్యాణ్, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.



## భాకరాపేట నడివీధి గంగమ్మ తల్లి జాతర

**సిద్ధవటం ఏప్రిల్ 19 ప్రభాతవార్త**



సిద్ధవటం మండలం పెద్దపల్లి గ్రామపంచాయతీ భాకరాపేట గ్రామంలో శనివారం అమ్మవారికి వేపాకులతో అలంకరించి విద్యుత్ దీపాలతో అలంకరించి ఆదివారము ఉదయం గ్రామంలోని అమ్మవారికి పసుపు కుంకుమలతో పూజలు చేసిన అనంతరం మహిళాలు బోనాలు పెద్ద ఎత్తున సమర్పించి ముక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి కాయ కర్పూరం సమర్పించి అమ్మవారి దీవెనలు పొందారు భాకరాపేట మూడురోడ్ల కూడలి నందు వెలసిన గ్రామ దేవత నడివీధి గంగమ్మతల్లి జాతర అంగరంగ వైభవంగా జరిగిందని గ్రామస్తులు తెలిపారు ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారని అమ్మవారి బండారు, కుంకుమ నిమ్మకాయలు భక్తులకు ఇచ్చి అమ్మవారి దీవెనలు ఎల్లవేళలా ఉండాలని కోరిన కోరికలు తీర్చే తల్లి భాకరాపేట నడివీధి గంగమ్మ తల్లిని వారు తెలిపారు ప్రతి సంవత్సరం జాతర వైభవంగా జరగడం ఎంతో సంతోషకరంగా ఉందని గ్రామస్తులు తెలియజేశారు..

## మే 2న అన్నమాచార్యుల 618 వ జయంతి ఉత్సవాలు

**కడప కార్పొరేషన్ ఏప్రిల్ 19 ప్రభాతవార్త:**
మే 2వ తేదీ శనివారం తెలుగు పద కవితా పితామహుడు ప్రముఖ వాగ్గేయ కారుడు అయిన శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల వారి 618 వ జయంతిని కడప హౌసింగ్ బోర్డ్ కోదండ రామాలయంలో నిర్వహిస్తున్నట్లు ఆలయ సేవా సమితి నిర్వాహకులు వెంకటరెడ్డి తెలిపారు. 2 తేదీ ఉ. 9.00 గంటలకు మాడవీధులలో నగర సంకీర్తన, 9:30 గం.లకు జ్యోతి ప్రజ్వలన అనంతరం అతిథుల సందేశం,10:30 గంటలకు అన్నమాచార్యుల సప్తగిరి సంకీర్తనల గోష్ఠిగానం, 12.00 గంటలకు పోటీలో గెలిచిన విజేతలకు బహుమతి ప్రధానము. అనంతరం మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ ఉంటుంది. ఈనెల 30 తేదీ గురువారం ఉదయం 9: 30గం.లకు ఆలయంలో అన్నమయ్య సంకీర్తనలపై పోటీలు నిర్వహిస్తామన్నారు. పోటీలలో పాల్గొనదలచిన వారు 28వ తేదీ రాత్రి 7:00 గం.ల లోపల పేర్లను సెల్ నెంబర్ 9440725110, 8096034302 ద్వారా నమోదు చేసుకోవాలన్నారు.

## ముఖ్యమంత్రి జన్మదిన వేడుకల్లో అందరూ భాగస్వాములు కండి : మంత్రి మండిపల్లి

**రాయచోటి ఏప్రిల్ 19 ప్రభాతవార్త**



నేడు మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదినం సందర్భంగా అన్నమయ్య జిల్లా రాయచోటి పటంలో భారీ కేక్ కట్ చేసి, అనంతరం అన్నా క్యాంటీన్లో అందరికీ ఉచిత అన్నదాన కార్యక్రమం ఉంటుందని మరియు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలోని రోగులకు పండ్లు బ్రెడ్డు పంపిణీ కార్యక్రమం ఉంటుందని తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి తెలియజేశారు.

# కాంగ్రెస్ పార్టీ మహిళలు పర్యాయపదాలు



**వేంపల్లె ఏప్రిల్ 19 ప్రభాతవార్త**

కాంగ్రెస్ మహిళలకు అన్యాయం చేసే పార్టీ అని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్ర బాబు వ్యాఖ్యానించడం గర్హనీయమని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ధ్వజమెత్తారు. తులసి రెడ్డి ఆదివారం వేంపల్లె లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ తన రాజకీయ ప్రస్థానం కాంగ్రెస్ తోనే ప్రారంభమైన విషయాన్ని చంద్రబాబు నా యుడు మరిచిపోయినట్లు ఉందని ఎద్దేవా చేశారు. బొంకరా బొంకరా పోలిగా అంటే టంగుటూరి మిరియాలు తాటికాయంత అన్నట్లు ఉన్నాయి చంద్రబాబు వ్యాఖ్యలు. కాంగ్రెస్ మహిళలు పర్యాయపదాలు. 1993 వ సంవత్సరంలోనే 33 ఏళ్ల కిందట స్థానిక ప్రభుత్వాల్లో మహిళలకు కాంగ్రెస్ 33!! రిజర్వేషన్లు కల్పించిన విషయాన్ని తులసిరెడ్డి గుర్తు చేశారు. ఈ చర్యవల్ల దేశ వ్యాప్తంగా కొన్ని లక్షల మంది మహిళలు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్లుగా, కార్పొరేటర్లుగా, మునిసిపల్ చైర్మన్లుగా, మున్సిపల్ కౌన్సిలర్లుగా, జిల్లా పరిషత్ చైర్మన్లుగా జడ్పిటిసిలుగా,మండల పరిషత్ అధ్యక్షులుగా, ఎంపీటీసీ లుగా, సర్పంచులుగా,వార్డు మెంబర్లుగా ఎన్నికయ్యారు అన్నారు. అనిబిసెం ట్, సరోజినీ నాయుడు,ఇందిరాగాంధీ సోనియాగాంధీ లాంటి మహిళలు భారత జాతీయ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులయ్యారు. కాంగ్రెస్ పార్టీ తరఫున శ్రీమతి ప్రతిభా పాటిల్ రాష్ట్రపతిగా, శ్రీమతి ఇందిరా గాంధీ ప్రధానమంత్రిగా, శ్రీమతి మీరా కుమార్ లోక్సభ స్పీకర్గా ఎన్నికయ్యారు.కాంగ్రెస్ పాలనలో మహిళలు ఎంతోమంది గవర్నర్లుగా,కేంద్ర మంత్రులుగా,రాష్ట్ర మంత్రులుగా అ య్యారు. కాంగ్రెస్ పార్టీ తరఫున సుచేతా కృపాలాని, నందినీ సత్పతి,శశికళా కాకోత్కర్, అన్వర తైమూర్, షీలా దీక్షి త్ లాంటి మహిళలు ముఖ్యమంత్రులు అయ్యారు. గ్రామీణ మహిళల ఆర్థిక,సామాజిక సాధికారిత కోసం 1982 83 ఆర్థిక సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీ డ్వాక్రా పథకాన్ని ప్రారంభించింది. డ్వాక్రా మహిళలకు పావలా వడ్డీ పథకాన్ని,సున్నా వడ్డీ పథకాన్ని ప్రారంభించింది కాంగ్రెస్. బాలికల కోసం బంగారు తల్లి పథకాన్ని,అమ్మల కోసం అమ్మ ఒడి పథకాన్ని కాంగ్రెస్ పార్టీ అమలు చేసింది. 2023లో పార్లమెంటులో ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇ చ్చింది. కాంగ్రెస్ అంటేనే మహిళల పార్టీ అని తులసి రెడ్డి నొక్కి వక్కా ణించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీపై అవాకులు చవాకులు పేలడం మాను కోవాలని తులసి రెడ్డి చంద్రబాబుకు సూచించారు. మీడియా సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ సుబ్రహ్మణ్యం, కదిరి ప్రసాద్ గౌడ్,విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి సుబ్బారెడ్డి,వేంపల్లె మండల శాఖ అధ్యక్షులు బీగాల రామకృష్ణ,కాంగ్రెస్ సీనియర్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉ త్తన్న,తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, బండారు వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా రిజర్వేషన్ బిల్లు ముసుగులో డీలిమిటేషన్

**ప్రొద్దుటూరు అర్బన్ ఏప్రిల్ 19, ప్రభాత వార్త :**

మహిళా రిజర్వేషన్ బిల్లు ముసుగులో డీలి మిటేషన్ చేయాలని ఎన్డీఏ కుట్ర పన్నిందని ప్రొద్దు టూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇర్ఫాన్ బాషా తెలిపారు. ఆదివారం ఇస్లాంపురంలోని తన కా ర్యాలయంలో ఆయన మాట్లాడుతూ మొదటిగా మహిళా రిజర్వేషన్ బిల్లు 2023 లోనే ఆమోద మైంద నిజంగా బీజేపీ ప్రభుత్వానికి మహిళల పట్ల చిత్తశుద్ధి ఉంటే ఇప్పుడు ఉన్న 543 ఎంపీ స్థానా ల్లోనే 33 రిజర్వేషన్ అమలు చేయవచ్చని దీనికి అన్ని పార్టీలు మద్దతు ఇస్తాయి కానీ, ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లును డీ లిమిటేషన్తో లింక్ చేసి అమలు చేయాలని ప్రయ త్నిస్తోంది. అంటే, ముందుగా జనగణన, తర్వాత డీలిమిటేషన్ ఆ తర్వాతే రిజర్వేషన్ అమలు అంటు న్నారు. ఇది ఆలస్యం చేయడానికి చేసిన రాజకీయ ప్రయత్నం మాత్రమే అన్నారు. ఇంకా ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే మహిళా రిజర్వేషన్ బిల్లు నోటిఫికేషన్తో పాటు డీలిమిటేషన్, యూని యన్ టెరిటరీలు, ఐటీకి సంబంధించిన ఇతర సవరణలను కలిపి ఒకేసారి ఆమోదించుకోవాలని ప్రయత్నించారని ఒకే ఓటింగ్లో అన్నీ ఆమోదిం చాలనే ఈ విధానంతో వారి దురుద్దేశం బయటప డిందని తెలిపారు.ఈ బిల్లుకు ఆమోదం రావాలంటే ప్రత్యేక మెజారిటీ 2/3 మెజారిటీ అవసరం. బీజే పీకి అది సాధ్యం కాదని తెలిసినా, ఈ బిల్లును తీసుకురావడం వెనుక రాజకీయ ప్రయోజనాలే ఉన్నాయి. గెలిస్తే క్రెడిట్ తీసుకోవడం, ఓడితే ప్రతి పక్షాలపై నిందలు వేయడం ఇదే వారి వ్యూహం. ఇప్పుడు డీలిమిటేషన్ అంశానికి వస్తే 1976 లో ఇందిరా గాంధీ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఎంపీ స్థానాలను ఫ్రీజ్ చేశారని తరువాత 2002లో అటల్ బిహారీ వాజపేయి కూడా ఆ ఫ్రీజ్ ను 2026 వరకు కొనసాగించారన్నారు. కానీ ఇప్పుడు జనాభా ప్రాతిపదికన సీట్లు పునర్విభజన చేస్తే, దక్షిణ రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగు తుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ వంటి రాష్ట్రాలు జనాభాను ని యంత్రించాయి, అభివృద్ధిలో ముందంజలో ఉ న్నాయి. దేశం జనాభాలో దక్షిణ రాష్ట్రాల జనాభా కేవలం 20 కానీ జీడీపీకి సుమారు 30 వరకు వాటా ఇస్తున్నాయి.

**అయితే డీలిమిటేషన్ వల్ల ఏమవుతుంది?**

జనాభా ఎక్కువగా ఉన్న ఉత్తర రాష్ట్రాలకు సీట్లు పెరుగుతాయి, దక్షిణ రాష్ట్రాలకు తగ్గిపోతాయి. అంటే అభివృద్ధి చేసిన రాష్ట్రాలకు శిక్ష, నియంత్రణ లేని రాష్ట్రాలకు ప్రోత్సాహం అనే పరిస్థితి వస్తుంది. ఇది రాజకీయంగా కూడా ప్రమాదకరం. ఈ మా ర్పులతో కొన్ని పార్టీలకు శాశ్వత రాజకీయ లాభం కలిగే అవకాశం ఉంది. అందుకే మేము డీలిమి టేషన్ విధానాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు

**మేము వ్యతిరేకం కాదు**

జనాభా ప్రతిపదికన చేస్తున్న డీలిమిటేషన్తో ముడిపెట్టె విధానాన్ని వ్యతిరేకిస్తున్నాం మా డిమాండ్ వెంటనే ప్రస్తుతం ఉన్న 543 సీట్లలోనే 33!! మహిళా రిజర్వేషన్ అమలు చేయాలి. ఇంకా కాంగ్రెస్ పార్టీపై నిందలు వేయడం సరికాదు. దేశ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ చేసిన సేవలు అపా రమైనవి. వ్యవసాయం, విద్య, హక్కుల చట్టాలు, ఉపాధి హామీ, ఫుడ్ సెక్యూరిటీ వంటి ఎన్నో సం స్కరణలు కాంగ్రెస్ పార్టీ తీసుకొచ్చింది. రాష్ట్ర స్థాయిలో కూడా కొంతమంది నేతలు బీజేపీకి మద్ద తు ఇవ్వడం బాధాకరం. కేంద్ర ప్రభుత్వానికి ప్రశ్నించాలసిన వారు ప్రశ్నించకుండా, ప్రశ్నించే వారిని విమర్శిస్తున్నారంటే ఇంతకంటే దౌర్భాగ్యం ఏమైనా ఉందా అని తెలిపారు. మహిళలను మభ్య పెట్టే రాజకీయాలు ఇక పని చేయవు. ప్రజలు, ము ఖ్యంగా మహిళలు, ఈ కుట్రలను అర్థం చేసుకుం టారు మరియు సరైన నిర్ణయం తీసుకుంటారు. దేశంలో మహిళలపై జరుగుతున్న ఘటనలను ఆప లేని ప్రభుత్వం, మహిళా సాధికారత గురించి మాట్లాడటం విశ్వసనీయత కోల్పోయింది. రాబోయే రోజుల్లో ప్రజలు ఈ రాజకీయాలను తిప్పికొట్టి, నిజమైన అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తారన్నారు.



## పులివెందుల సేవా సంస్థకు రెడ్ క్రాస్ గుర్తింపు



**పులివెందుల ఏప్రిల్ 19 ప్రభాతవార్త :**

పులివెందులకు చెందిన స్నేహిత అమృత హస్తం సేవాసమితి చేపడుతున్న సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా అనంతపురం జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నుంచి ప్రశంసలు లభించాయి. ఈ సందర్భంగా జిల్లా చైర్పర్సన్ కాపు భారతి చేతుల మీదుగా జ్ఞాపికను అందజేశారు.ఈ జ్ఞాపికను స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఉచిత విద్యా కార్యక్రమంలో భాగంగా సేవలం దిస్తున్న ఉపాధ్యాయ బృంద సభ్యుడు రామాం జనేయులు స్వీకరించారు. సమాజంలోని పేద విద్యార్థులకు ఉచిత విద్య అందిస్తూ, సేవా కార్యక్రమా లను విస్తరింపజేస్తున్న ఈ సంస్థకు మరింత ప్రోత్సాహం లభించిందని నిర్వా హకులు తెలిపారు.ఈ సందర్భంగా సేవాసమితి సభ్యులు మాట్లాడుతూ, భవిష్యత్తులో మరింత విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించేం దుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

## గంగమ్మ గుడి నిర్మాణానికి విరాళం



**మదనపల్లె, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :**

నిమ్మనపల్లె మండలంలోని పిట్టావాండ్లపల్లె సమీ పంలో కొత్తచెరువు వద్ద నూతనంగా నిర్మాణం చేపట్టిన బోయకొండ గంగమ్మ ఆల య నిర్మాణానికి మదనపల్లె నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్.రెడ్డి సాహెబ్ రూ.20వేలు విరాళం అందజేశారు. ఆలయ నిర్మాణ ప్రదాతలు బి.నాగ రాజు, గంగులమ్మ దంపతలు ఆహ్వానం మేరకు ఆదివారం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్.రెడ్డిసాహెబ్ నిర్మాణంలో ఉన్న బోయకొండ గంగమ్మ ఆలయా న్ని సందర్శించారు. గంగమ్మ ఆలయ నిర్మాణానికి తనవంతు సాయంగా రూ.20 వేలు రెడ్డిసాహెబ్ నిర్మాణదాతలకు అందజేశారు. ఈకార్యక్రమంలో రెడ్డిసాహెబ్తో పాటు మండల మాజీ అధ్యక్షులు, జిల్లా మైనార్టీ కార్యదర్శి ముభారక్ఖాన్, బిసిసెల్ మాజీ అధ్యక్షులు ఆర్.నాగరాజు, యూత్ కాంగ్రెస్ నాయకులు శరత్కుమార్రెడ్డి, సుబ్బన్న, వెంకటప్ప, కాంగ్రెస్పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన క్రీడాభారతి అన్నమయ్య జిల్లా కబడ్డీ పోటీలు



**మదనపల్లెక్రైమ్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త.**

మదనపల్లి లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో అన్నమయ్య జిల్లా క్రీడాభారతి కబడ్డీ పోటీలు ఘనంగా నిర్వహించారని జిల్లా కార్యదర్శి నరేష్ బాబు తెలిపారు. కబడ్డీ పోటీల ప్రారంభ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా క్రీడాభివృద్ధి శాఖ అధికారి చంద్రశేఖర్ అన్నమయ్య జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి పులి నరేంద్ర కుమార్ రెడ్డి రన్ టీవీ డైరెక్టర్ సిరి వేలు చరణ్ కుమార్ క్రీడాభారతి ఉపాధ్యక్షులు విష్ణు చైతన్య కబడ్డీ ఆడి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ క్రీడా పోటీలకు జిల్లా నలుమూలల నుండి బాలబాలికలు అండర్ 14, 17, 19 విభాగాలలో బాల బాలికల క్రీడాకారులు పాల్గొన్నారు. క్రీడాకారులు చాలా ఉత్సాహంగా క్రీడలలో పాల్గొని ప్రతిభ చూపారు. ప్రతిభ చూపిన వారిలో అండర్ 14 విభాగంలో నెహ్రూ మున్సిపల్ హై స్కూల్ విద్యార్థులు, అండర్ 17 విభాగంలో కలిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, అండర్ 19 విభాగంలో జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపి విజేతలుగా నిలిచారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ రాటకొండ గురు ప్రసాద్ గారు, రాష్ట్ర కురుబ సంఘం డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ పాల్గొన్నారు. రాటకొండ గురు ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం ద్వారా మానసిక ఒత్తిడిని జయించి చురుకుగా క్రీడల్లో పాల్గొంటారని , ఆటలు ఆడడం ద్వారా ఆరోగ్యంగా ఆనందంగా జీవిస్తారని, 2036లో జరిగే ఒలంపిక్స్ పోటీలలో కబడ్డీ క్రీడను కూడా చేర్చాలని, అందులో అన్నమయ్య జిల్లా మదనపల్లి నుండి క్రీడాకారులుపాల్గొనేలా శిక్షణ తీసుకోవాలని విద్యార్థులను ఉద్దేశించి తెలిపారు. విజేతలైన క్రీడాకారులకు రాటకొండ గురు ప్రసాద్, జిల్లా క్రీడాభివృద్ధి శాఖ అధికారి చంద్రశేఖర్ , అన్నమయ్య జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి పులి నరేంద్ర కుమార్ రెడ్డి, రాష్ట్ర కురవ సంఘం డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ గారు బహుమతులను క్రీడాకారులకు ప్రధానం చేశారు. క్రీడా కారుల బహుమతులు జివిఎస్సిఎస్ సొసైటీ ఫౌండర్ జీ శ్రీధర్ కుమార్ సమకూర్చారు. అని అన్నమయ్య జిల్లా క్రీడాభారతి కార్యదర్శి నరేష్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సభ్యులు శ్రీకాంత్, రమేష్, క్రీడాభారతి ఉపాధ్యక్షులు విష్ణు చైతన్య, స్పెషల్ బ్రాంచ్ పోలీస్ మిమిక్రీ రామమూర్తి, క్రీడాభారతి మదనపల్లి శాఖ అధ్యక్షులు బాలాజీ, షూటింగ్ బాల ఆసియన్ గోల్డ్ మెడలిస్ట్ యూసఫ్ భాష, క్రీడా భారతి సభ్యులు మురళి, కిరణ్, వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజ ,లత, భారతి, శరత్, సీనియర్ కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారు

### వెనకబడిన తరగతుల

# సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్ష

**కలికిరి, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:**

మహాత్మ జ్యోతిరావుపూలే ఏపీ వెనకబడిన తరగతుల సంక్షేమ గురుకుల కళాశాలలు,పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశ పరీక్ష ఆదివారం నిర్వహించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ సోమశేఖర్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జూనియర్ కళాశాల ప్రవేశానికి పరీక్ష జరగగా 214 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. 6, 7, 8 తరగతుల విద్యార్థుల ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు నిర్వహిం చామన్నారు. 6, 7, 8 తరగతుల విద్యార్థులు 328 మంది దరఖాస్తు చేసుకోగా 204 మంది పరీక్షకు హాజరయ్యారన్నారు.

## కార్మిక హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమిద్దాం

మహసభల గోడ పత్రికలు విడుదల చేసిన ఏఐటీయూసీ నాయకులు



గోడ పత్రిక ఆవిష్కరిస్తున్న దృశ్యం

**పీలేరు ఏప్రిల్ 19 ప్రభాతవార్త:**

కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న పాలక ప్రభుత్వాలు కార్మికుల హక్కుల హరిస్తున్నారని హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమిద్దామని ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ కమిటీ సురేష్ కుమార్, ఏఐటీయూసీ పీలేరు నియోజకవర్గ కార్యదర్శి నర్సింహులు తెలిపారు. ఏప్రిల్ 26 28 వరకు తిరుపతి లో జరుగనున్న ఏఐటీయూసీ రాష్ట్ర 18వ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం పీలేరు లో మహసభల గోడ పత్రికలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సరీర్ఘ పోరాటాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడం అత్యంత అన్యాయమని, రద్దు చేసిన చట్టాలను అమలు చేయాలని నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్లో ఉన్న భవణ నిర్మాణ కార్మికుల క్లైములు పరిష్కారం చేయాలని కోరారు.ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లకు పెండింగ్లో ఉన్న వేతనాలు చెల్లించాలని,పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు.ఆటో హమాలీ వర్కర్స్ కు ఈయస్ఐ తో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ స్కీముల్లో పనిచే స్తున్న వర్కర్స్ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కనీస వేతనం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కొండ రెడ్డి, సత్యం రెడ్డి, మస్తాన్,రఫి, చంద్రయ్య, హుస్సేన్, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా కోరమంగళ వెంకటాపుర మారెమ్మ జాతర



**రామసముద్రం ఏప్రిల్ 19 ప్రభాతవార్త**

కర్ణాటక రాష్ట్రం బెంగళూరు కోరమంగళ వెంకటాపుర మారేమ్మ జాతర కరగా మహోత్సవ శెనివారం, ఆదివారం ఘనంగా నిర్వహించారు. కోరమంగళ గ్రామంలో వందల ఏళ్ల నాటి చరిత్ర గల బెంగళూరు కోరమంగళ మరెమ్మ జాతర కరగా సందర్భంగా ఆదివారం అత్యంత వైభవంగా కరగా మరియు పుష్ప పల్లకీలపై దేవ దేవతలు పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ కరగా మహోత్సవాన్ని ఈ గ్రామపెద్దలు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు, పుష్ప పల్లకీ లను పలు రకాల పుష్పాలతో అలంకరణ చేశారు.గ్రామానికి కరగా రావడంతో మహిళలు ఇంటి ఆవరణలో పసుపు నీళ్ల చల్లి పలురకాల పుష్పాలతో అలంకరణ చేసి స్వామికి పళ్ళు, ఫలహారాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పురావీధుల్లో గ్రామ దేవ దేవతలకు మహిళలు హారతులు పట్టి కొబ్బరికాయలు కొట్టి మొక్కలు చెల్లించుకున్నారు రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు ఈ వేడుకలు తిలకించడానికి ఏపీ, తమిళనాడు నుండి భక్తులు తరలివచ్చారు.ఈ కరగామహోత్సవంలో రాజు క్షత్రియకుటుంబ సభ్యుల కరగా మోసే పూజారికి మంగళ హారుతులు పట్టి కొబ్బరికాయలు మొక్కులు చెల్లించారు. వీరికి వేదమంత్రాలతో ఆశీర్వదించి పసుపు కుంకుమ ఫలహారాలు అందించారు,ఈ ఉత్సవాలకు రామసముద్రం మండలం నుంచి విచ్చేసిన వారికి కోరమంగళ ఆకాష్, రాణి,భూపతి రాజు, కావ్య(గంగమ్మ )దంపతులు, వెంకటేష్ రాజు విందు ఏర్పాటు చేశారు.

## అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాలను సీజ్ చేయాలి

ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ



మట్టిని తరలిస్తున్న దృశ్యం

**మదనపల్లె, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :**

మదనపల్లె రూరల్ మండలంలోని పోతబోలు, ఆరోగ్య వరం సమీపంలో అక్రమంగా మట్టి, ఇసుక రాత్రి సమయాల్లో తరలిస్తున్న వాహనాలను సీజ్ చేయాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ ఆదివారం ఓ ప్రకటలో పేర్కొన్నారు. పట్టణ పరిసర ప్రాంతాల్లోని చుట్టూ ఉన్న కొండలను తవ్వి మట్టి, ఇసుకు తరలిస్తున్న ఘటనలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని ఇది పర్యావరణానికి తీవ్రమైన నష్టం కలిగించే చర్య అని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలు పూర్తిగా ఉల్లంఘిస్తూ మట్టి మాఫియా అక్రమ రవాణాను నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి బారీ స్థాయిలో అక్రమ తవ్వకాలు జరగడం అసంభవం అన్నారు. దీనిపై తక్షణమే సబ్కలెక్టర్ స్పందించి విచారణ చేపట్టాలని కోరారు. అక్రమ తవ్వకాల వల్ల భూగర్భజలాలు తగ్గిపోవడం, భవిష్యత్తులో సహజ విపత్తులకు దారితీయం వంటి ప్రమాదాలు ఏర్పడుతున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అక్రమంగా మట్టిని తరలిస్తున్న వాహనాలను అరికట్టాలని కోరారు.

## యువత అంబేద్కర్ మార్గంలో నడవాలి

బాస్ యువజన విభాగం పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న బాస్ నాయకులు

**మదనపల్లె, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :**

బోధిసత్వ బాబాసాహెబ్ అంబేద్కర్ చూసిన శీలవంతమైన మార్గంలో యువత నడవాలని, భారతీయ అంబేద్కర్ సేన (బాస్) యువజన విభాగం నేతలు పిలుపునిచ్చారు. యువత నైతికత అన్న అంశంపై ఆదివారం స్థానిక ప్రెస్క్లబ్లో బాస్ యువజన విభాగం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా జరిగిన విలేకర్ల సమావేశంలో బాస్ యువజన విభాగం నాయకులు బైపనీ సురేష్, నీరుగట్టు రాజేష్.పి.వృద్విరాజ్, చాట్ల కళ్యాణ్, ఆర్.మహేంద్ర, కె.తేజ, ఎస్.ఈశ్వర్లు మాట్లాడుతూ యువతను సరైన మార్గంలో నడిపించే స్పష్టమైన కార్యక్రమం ప్రభుత్వం వద్ద లేకపోవడంతో యువత పెడదోవ పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. యువత అంబేద్కర్ మార్గంలో నడిపిస్తే, దేశంలో గొప్ప ఆవిష్కరణలు జరుగుతాయని తెలిపారు. బాస్ యువజన విభాగం ఆధ్వర్యంలో జరిగిన అంబేద్కర్ జయంతి ముందస్తు వేడుకలు విజయవంతం చేసిన బాస్ కుటుంబ సభ్యులకు అంబేద్కర్ అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోతబోలు రెడ్డప్ప, బాస్ వ్యవస్థాపకులు పిటిఎం శివప్రసాద్, చిట్టిబాబు, చిన్నప్ప, బాస్ నాయకులు నీరుగట్టి రమణ, గంపల రమణ, దేగాని రమణ, గంగాధర్, బురుజు రెడ్డిప్రసాద్, క్రిష్ణ,శశిధర్, తరుణ్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదినాన్ని జయప్రదం చేయండి



**చిన్నమండెం ఏప్రిల్ 19 ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని యంయన్ఆర్ కాంప్లెక్స్ వద్ద బస్టాండ్లో రాష్ట్ర రవాణా,యువజన,క్రీడా శాఖ మంత్రివర్యులు శ్రీ "మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం సాయంత్రం 6 గంటలకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదినం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని మండల టీడీపీ అధ్యక్షులు మూగి రెడ్డెప్ప తెలిపారు. మండలం లోని మండల కమిటీ నాయకులు, గ్రామ కమిటీ అధ్యక్షులు కమిటీ నాయకులు క్లస్టర్ ఇంచార్జి లు, యూనిట్ ఇంచార్జి లు, బూత్ ఇంచార్జి లు తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు అందరు 20 వ తేదీ సోమవారం సాయంత్రం 6.30 గంటలకు హాజరు కావాలని ఆయన కోరారు.అక్కడ భారీ కేక్ కటింగ్ చేసి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరుగుతుంది.కావున మండలంలోని 13గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరుకుంటున్నాము.

## స్వర్ణ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఈ నెల 21న బహిరంగ వేలం



**రామసముద్రం ఏప్రిల్ 19 ప్రభాతవార్త:**

రామసముద్రం మండలం లోని శ్రీనివాస పురం రోడ్డులోని స్వర్ణ గ్రామపంచాయతీ కార్యాలయంలో పంచాయతీకి చెందిన 202627ఆర్థిక సంవత్సరానికి వేలం పాట ఈ నెల 21 న ఎంపిడిఓ 1అన్నపూర్ణ అధ్యక్షతన పంచాయతీ సెక్రటరీ మునిస్వామి నాయక్ ఆధ్వర్యంలో ఉదయం 11గంటలకు వారపు సంత, బస్టాండ్ గేటు, దిన సరి మార్కెట్ బహిరంగ వేలం నిర్వహించ నున్నట్లు పంచాయతీ కార్యదర్శి మునిస్వామి నాయక్ తెలిపారు. వేలం పాట దక్కించుకున్న పాటధారుడు వెంటనే మిగతా మొత్తం చెల్లించాలి, పంచాయతీకి బాకీలు లేని వారికే అవకాశం ఉంటుందని పంచాయతీ సెక్రటరీ మునిస్వామి నాయక్ తెలిపారు.

## తంబళ్లపల్లెలో డంపింగ్ లేక పేరుకుపోయిన చెత్త



**తంబళ్లపల్లె ఏప్రిల్ 18 ప్రభాతవార్త :**

తంబళ్లపల్లె నియోజకవర్గ కేంద్రంలో గత నాలుగు రోజులుగా చెత్త తరలించకపోవడంతో ఎక్కడ చూసినా చెత్త దెబ్బలు పేరుకుపోయాయి. ప్రతిరోజు పంచాయితీ ట్రాక్టర్ ద్వారా చెత్త ఎప్పటికప్పుడు తరలించేవారు. ఏడాది క్రితం మల్లయ్య కొండ కింద గల డంపింగ్ యార్డ్ వద్ద చెత్త వేయరాదని కొందరు అడ్డుకోవడంతో డంపింగ్ యార్డ్ ను ములకలచెరువు రహదారి లోని ప్రభుత్వ భూములో డంపింగ్ యార్డ్ గా ఉపయోగించుకుంటున్నారు. అయితే అక్కడ దుర్వాసన, ఊరకుక్కల సమస్యతో అక్కడి రైతులు సైతం అడ్డుకున్నారు. గత వారం రోజులుగా చెత్త ఎక్కడికి తరలించాలో దిక్కు తెలియక చెత్త తరలించే ట్రాక్టర్ డ్రైవర్ చెత్త తరలించడం ఆపేసాడు.దీంతో తంబళ్లపల్లె పురవీధులు చెత్త పేరుకుపోయి దుర్గంతభరితమై దుర్వాసన తో దోమలు విస్తృతంగా ప్రభలుతున్నాయి. చెత్త తరలించడానికి మండల పరిషత్ అధికారులతో పాటు స్థానిక పంచాయితీ కార్యదర్శి పట్టించుకోకపోవడంపై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మండల పరిషత్ అధికారులు రెవెన్యూ అధికారులతో చర్చించి డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించి తంబళ్లపల్లెలో పారిశుధ్యం మెరుగుకు సహకరించాల్సి ఉంది.

## ఏఐటియూసి రాష్ట్ర మహాసభలను విజయవంతం చేద్దాం

ఏఐటియుసి నాయకులు పిలుపు



**మదనపల్లె, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :**

కార్పోరేట్ల లాభాల కోసమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని, 50లక్షల మంది షెడ్యూల్ రంగాల్లో పనిచేసి కార్మిక వర్గానికి 15సంవత్సరాల నుంచి జీతాలు పెరుగుదల లేకుండా రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల జీతాలు పెంచం జీవితాంతం పనిచేసినా పర్మినెంట్ చేయమని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ ఆరోపించారు. రాష్ట్ర మహాసభలను విజయవంతం చేద్దామని శనివారం స్థానిక టమోటా మార్కెట్యార్డు వద్ద మహాసభల గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ కార్మికవర్గం ఎన్నడూ లేనివిధంగా సమస్యలను ఎదుర్కొంటోందని కార్మికుల కష్టాలపై చర్చించి భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించడానికి 18వ రాష్ట్ర మహాసభలు ఈనెల 26నుంచి 28వరకు తిరుపతిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్మిక హక్కులను కాలరాస్తూ కార్మికవర్గాన్ని కట్టు బానిసలుగా మార్చి కార్పోరేట్లకు అధిక లాభాలు చేకూరుస్తున్నాయని తెలిపారు. కాంట్రాక్టు, అవుట్సోర్సింగ్ డైలీవేజ్ పేస్ రేటు తదితర రేట్ల పేరుత కార్మిక వర్గాన్ని దోపిడి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్కుమార్, జిల్లా కార్యదర్శి దేవా, పట్టణ కార్యదర్శి తిరుమల, ఖాదర్బాషా, హుస్సేన్, హామాలీలు నరిసింహులు, వెంకటరమణ, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## భార్యను గోడకేసి కొట్టి కిరాతకంగా చంపిన భర్త



**పీలేరు ఏప్రిల్ 19 ప్రభాతవార్త**

అన్నమయ్య జిల్లాలో భర్త తన భార్యను కిరాతకంగా కొట్టిచంపేసిన అమానుష ఘటన ఆదివారం మధ్యాహ్నం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పీలేరు నియోజ కవర్గం, వాల్మీకి పురానికి చెందిన జగదీష్ మోనిక దంపతులు, స్థానికంగా టీ షాపు నిర్వహించి కుటుంబాన్ని పోషించుకునే వారు. ఇటీవల షాపు నిలిపేసి ఉద్యోగం కోసం బెంగళూరుకి వెళ్లారు. అక్కడ ఏం జరిగిందో ఏమో.. తిరిగే వాల్మీకిపురానికి ఆదివారం మధ్యాహ్నం వచ్చి భార్యను గడకేసి కొట్టి చంపేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని హత్యకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. అయితే తాను తన భార్యను చంపేశానని నిందితుడు పోలీస్ స్టేషన్కు వచ్చి లొంగిపోయినట్లు సమాచారం.

## పరిసర ప్రాంతాలు
# పరిశుభ్రంగా ఉంచుకోవాలి..

కడప కార్పొరేషన్ ఏప్రిల్ 19 (ప్రభాతవార్త):



నివాస పరిసర ప్రాంతాలు శుభ్రంగా లేనట్లయితే క్రిమి కీటకాలు, దోమలు ఉత్పత్తి అయ్యి.. తద్వారా వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నది.. కనుక మనం నివసించే పరిసరాలు, ఖాళీ ప్రదేశాలు శుభ్రంగా ఉంచుకోవాలని కడప నగరపాలక సంస్థ ప్రజా వైద్యాధికారి సొధా గిరి రమేష్ తెలిపారు. నగర పరిధిలోని చిన్న మామపల్లి ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప నగర సుందరీకరణకు నగరపాలక పారిశుద్ధ్య కార్మికులతో పాటుగా స్థానిక ప్రజల సహకారం ఎంతో అవసరమని తెలిపారు. అందరూ శుభ్రతను పాటించాలని చెత్త ఎక్కడంటే అక్కడ పడవేయకుండా మీ ఇంటి వద్దకు వస్తున్న వాహనాలకు అందించాలని వారు కోరారు.

## సమాజ సేవలో సగరుల పాత్ర గొప్పది
# విద్యాభివృద్ధిపై దృష్టి అవసరం



బద్వేలు, ఏప్రిల్ 19, ప్రభాతవార్త

బద్వేల్ డివిజన్ పరిధిలో సగర/ఉప్పర ఉద్యోగులు బద్వేల్ పట్టణంలో సమావేశమై విద్యాపరంగా అభివృద్ధి చెందాల్సిన అవసరంపై చర్చించారు. సగర ఉపాధ్యాయఉద్యోగపెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి కూరాకు రవీంద్ర ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, సగరులు గతంలో సముద్రం నుండి ఉప్పు ఉత్పత్తి చేయడం, చెరువులు తవ్వడం, కాలువలు నిర్మించడం, గృహ నిర్మాణంలో భాగస్వామ్యం కావడం ద్వారా సమాజ అభివృద్ధికి కీలకంగా పనిచేశారని గుర్తుచేశారు. ప్రస్తుతం ఈ వృత్తులకు ప్రాధాన్యత తగ్గడంతో ఇతర రంగాల్లోకి మారాల్సి వచ్చిందని తెలిపారు. విద్యాపరంగా ఎదిగి సమాజానికి మరింత సేవ చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సునీల్ కుమార్, లక్ష్మీనరసయ్య, నరసింహులు, రవి, శ్రీహరి, రవిచంద్ర, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# నూతన కార్యవర్గం ఏర్పాటు



ప్రొద్దుటూరు అర్బన్ , ఏప్రిల్ 19, ప్రభాత వార్త :

స్థానిక హోమస్పేట లోని ప్రొద్దుటూరు రాష్ట్ర ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర అధ్యక్షులు ఇంజా సోమశేఖర రెడ్డి, ప్రధాన కార్యదర్శి జివిన్ సాయికుమార్, ఉపాధ్యక్షులు గరుడాచలం ఆధ్వర్యంలో రాష్ట్ర ఉద్యోగుల సంఘం ప్రొద్దుటూరు తాలూకా కార్యవర్గం ఏర్పాటు చేశారు. ఈ నూతన కార్యవర్గం అధ్యక్షులుగా కె.సుబ్బరాయుడు, ఉపాధ్యక్షులుగా ఎం బాల గంగాధర్, జనరల్ సెక్రటరీగా బి ఆంజనేయుడు, సెక్రటరీగా పి.కేశవరెడ్డి, ట్రెజరర్ గా డి.ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎం.రాజేశ్వరి, ఎం.నాయబ్ భాషా, ఎస్.ఫణీంద్ర, కె. దస్తగిరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం నియామక పత్రాన్ని అధ్యక్షుడు ఇంజా సోమశేఖర్ రెడ్డి అందజేస్తూ సభ్యులకి అభినందనలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయికుమార్, ఉపాధ్యక్షుడు గరుడాచలం, పాలకవర్గ సభ్యులు నాగేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి మల్లేలమ్మ
# విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు

దువ్వూరు, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:



మండల పరిధిలోని గుడిపాడు నుండి గొల్లపల్లి పోయే రహదారిలో నూతనంగా నిర్మించబడిన శ్రీ పోతురాజు సవిధ శ్రీ సాక్షి మల్లేలమ్మ దేవత విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు సోమవారం నుండి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం వేద పారాయణం, గో మహాలక్ష్మి పూజ, గణపతి పూజ, అంకురార్పణ, దీక్షా హోమములు అలాగే 21వ తేదీ మంగళవారం అమ్మవారి మంత్ర హోమములు, అభిషేకములు, మంగళహారతి, 22వ తేదీన యంత్ర ప్రతిష్టాపనము, ప్రధాన కలశ పూజలు, కళాభిషేకం, వస్త్ర అలంకరణ, మంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 22వ తేదీన మల్లెల మా దేవత ప్రతిష్ట మహోత్సవము వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా 22వ తేదీన బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో వరుసగా 50వేలు, 40వేలు, 30వేలు, 20వేలు, 10వేల రూపాయలు బహుమతులుగా ఉంటాయన్నారు. అలాగే కోలాటం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలలో మండలంలోని ప్రజలు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

# శ్రీ కనుమ పోలేరమ్మ అమ్మవారి రథోత్సవం..

బ్రహ్మంగారిమఠం ఏప్రిల్ 19 ప్రభాతవార్త



ప్రముఖ పుణ్యక్షేత్రమైన జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారికి నిప్పు తెచ్చిన శ్రీ కనుమ పోలేరమ్మ ఆలయం వద్ద ప్రతి మంగళ వారం,శుక్రవారం, ఆదివారం రోజున శ్రీ కనుమ పోలేరమ్మ అమ్మవారి గుడి చుట్టూ ఊరేగింపుగా రథోత్సవంను మఠాధిపతి శ్రీ వీర దర్మజ వెంకటాద్రి స్వామి ఆదేశాల మేరకు రథోత్సవాన్ని నిర్వహిస్తున్నామని మేనేజర్ ఈశ్వరయ్య చారి అన్నారు. ఆదివారం ఉభయ దాతలైనా బద్వేల్ వాస్తవ్యులు వెంకటేశ్వర వర ప్రసాద్,వారి ధర్మపత్ని జయశ్రీ మరియు పర్లకొండ పి పి ఎన్ ప్రసాద్ దంపతులు భక్తుల మధ్య,రథోత్సవంను నిర్వహించాము,అమ్మవారి రథోత్సమును అవకాశాన్ని భక్తులందరూ ఉపయోగించుకొని శ్రీ కనుమ పోలేరమ్మ అమ్మవారి ఆశీస్సులు పొందగలరని వారన్నారు. ఈ కార్యక్రమం లో పూజారులు కేశవ, మిథున్,సిబ్బంది నాగలింగా చారి, సన్నే బోయిన గురు కృష్ణ,చిన్న సుబ్బారాయుడు,భక్తులు తది తరులు పాల్గొన్ని రథోత్సవంను జయపదం చేశారు.

# ప్రభుత్వ హాస్పిటల్ వద్ద అగ్ని ప్రమాదాలపై అవగాహన





బద్వేల్ అర్బన్ ఏప్రిల్ 19 ప్రభాతవార్త :

అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా 6,వ రోజు బద్వేల్ సీమాంక్ ప్రభుత్వ హాస్పిటల్ యందు అగ్ని ప్రమాదాల పట్ల అవగాహన కార్యక్రమాన్ని అగ్నిమాపక ఇన్చార్జ్ ఆఫీసర్ చంద్రుడు ఆధ్వర్యంలో హాస్పిటల్ డాక్టర్స్ మరియు నర్స్ పలువురు సిబ్బందికి అగ్నిమాపక సిబ్బంది పలు రకాల విన్యాసాలతో ఆసుపత్రిలో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా సురక్షితంగా బయటపడాలి అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ సందర్భంగా అగ్నిమాపక ఆఫీసర్ చంద్రుడు మాట్లాడుతూ ఆస్పత్రిలో అనుకోకుండా అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఒక్కసారిగా గుంపులు గుంపులుగా బయటకు రాకుండా ఒక లైన్ పరంగా పై అంతస్తు నుంచి కిందికి రావడం వలన సురక్షితంగా అందరూ బయటికి రాగలుగుతారన్నారు, అలాకాకుండా గుంపులు గుం పులుగా ఎప్పుడైతే ఒక్కసారిగా అందరూ బయటకు రావాలని చూస్తారో అలాం టప్పుడే భయంతో అనేకమంది ఇబ్బందులకు గురవుతారన్నారు, అనంతరం అగ్ని ప్రమాదాలపై అగ్నిమాపక సిబ్బంది పలు రకాల విన్యాసాలతో ఆసుపత్రి సిబ్బందికి తెలియచేశారు అలాగే అగ్నిమాపక కరపత్రాలను హాస్పిటల్ డాక్టర్స్ మరియు సిబ్బందికి అందజేశారు అగ్ని ప్రమాదాల నివారణే లక్ష్యంగా అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహించడం జరుగుతుందని కావున అగ్నిప్రమాదాల ప ట్ల ప్రతి ఒక్కరు తగిన జాగ్రత్తలు తీసుకొని ఏదైనా ప్రమాదాలు జరిగినప్పుడు మనోధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు,ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూ పరిటెండ్ డాక్టర్ సుబ్బారెడ్డి,డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ హిమబిందు డాక్టర్ మహేష్, డాక్టర్ ప్రత్యూష అగ్నిమాపక సిబ్బంది శ్రీనివాసులు, పాములేటి నాయక్, చెన్నయ్య ప్రభాకర్ రావు, మాబురెడ్డి, బాలయ్య, రాజశేఖర్, రాజు తో పాటు పలువురు హాస్పిటల్స్ సిబ్బంది డాక్టర్స్ పాల్గొన్నారు.

# ఉనికి కోసమే తమ కుటుంబంపై బురదజల్లే ప్రయత్నం చేయడం బంగారు రెడ్డికి తగదు

## మాజీ వార్డు సభ్యులు కొనిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి

ప్రొద్దుటూరు ఏప్రిల్ 20 ప్రభాతవార్త



కొత్తపల్లి పంచాయతీ పరిధిలో వైసీపీ నాయకుల ఉనికి కోసమే తమ కుటుంబం పై బురదజల్లే ప్రయత్నం చేయడం బంగారు రెడ్డికి తగదని మాజీ వార్డు మెంబర్ కొనిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి సూచించారు. ఆదివారం స్థానిక కొర్రపాడు రోడ్డులోని కొని రెడ్డి ఆయిల్ మిల్ నందు ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ తాను శివాలయం భూమిని వేలం ద్వారా లీజ్ లో పొందామని, తాము లీజ్ కు పాడిన రోజే ఆ స్థలం రికార్డుల కన్నా తక్కువగా వుందని తెలిపి, అధికారులకు తెలిపామని స్పష్టం చేశారు. ఆర్జేసీ ఈఓ టెండర్ జరిపితే తాను హెచ్చు పాటాదారునిగా లీజు దక్కించుకున్నానని, తాము అక్కడ పనులు చేసుకునే హక్కు పొందామని తెలిపారు. టెండర్ విషయంలో సందేహాలు వుంటే అధికారులను అడగాలని తెలిపారు. దేవస్థాన స్థలం తాము పాడి నందుకు పనులు చేస్తామని వివరించారు. కోర్టుకు వెళ్లే హక్కు ప్రతి ఒక్కరికీ వుందని, బంగారు రెడ్డి కోర్టుకు వెళ్లవచ్చని తెలిపారు. తాము ఫౌండేషన్ ద్వారా నిర్వహించే అన్నదానికి దాతల నుండి డబ్బు వసూలు చేశామని ఆరోపించారని, దాదాపు 3 సంవత్సరాలలో సుమారు 7 లక్షల మంది తమ 10 రూపాయల భోజనం చేశారని వివరించారు. కాగా మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి వరాజన్న క్యాంటీన్ పేరుతో 11 సంవత్సరాల పాటు భోజనం పెడతామని, 11 నెలలకు ఎత్తి పెట్టారని విమర్శించారు. కేవలం వాస్తవాలు మాట్లాడితే స్వాగతిస్తామని, బురద జల్లడం మానుకోవాలని సూచించారు. బంగారు రెడ్డి ఆయిల్ మిల్లులో పని చేసే సమయం నుండి తాము సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, తమకు ఏనాటి నుండో ఆయిల్ మిల్లు వుందని గుర్తించాలన్నారు. బంగారు రెడ్డి గుమస్తా నుండి ఎదిగితే దైవాశీర్వాదం, ఎవరైనా ఎదిగితే అవినీతా అని ప్రశ్నించారు. తమ కుటుంబం గురించి ప్రొద్దుటూరు ప్రజలకు తెలుసన్నారు. తమ పైన చేసిన ఏ ఆరోపణలు అయినా నిరూపించాలని సవాల్ విసిరారు. మాజీ ఎమ్మెల్యే తాము వ్యతిరేకించిన నాటి నుండి ఆరోపణలు అవి నిరూపించాలి. మీరు మాపై బురద జల్లితే ప్రజలు త్రిప్పి కొట్టారని, మా తండ్రి శివచంద్రారెడ్డి స్వతహాగా సర్పంచిగా గెలిచారని గతంలో మాజా ఎమ్మెల్యే రాచమల్లు చెప్పిన విషయం మరచిపోయారా అని ప్రశ్నించారు. మత్స్య కాలనీ లో ప్రజలు మీకు బుద్ధి చెప్పారని గుర్తుంచుకోవాలన్నారు. గత సార్వత్రిక ఎన్నికలలో కూడా ప్రజలు మిమ్మల్ని త్రిప్పి కొట్టారని స్పష్టం చేశారు. బచ్చుల సునీల్ జ్ఞాపకార్థం వారి మిత్రులు తమ ఫౌండేషన్ తో కలిసి చలివేంద్రం ఏర్పాటు చేస్తారని, బివిఎస్ వారితో తాము డబ్బులు తీసుకుని సేవా కార్యక్రమాలి చేసి వుంటే వారితో చెప్పించాలని సూచించారు. రాచమల్లుతో పాటు తాము 2014 నుండి కొనసాగామని, ఎంవిఆర్ బ్రతికి వున్న సమయంలో మీరు బస్టాండ్ అవతలికి రాలేక పోయారని గుర్తు చేశారు. ప్రస్తుతం సర్పంచి పదవి పూర్తయిన తర్వాత కేవలం మాపై బురద జల్లి లబ్ది పొందాలని చూస్తున్నారని తెలిపారు. మాపై బురద జల్లడం కోసం మీడియా సమావేశం ఏర్పాటు చేస్తారని, మీ మాటలలో వాస్తవాలు వుండవని తెలిపారు. తాము మీ దగ్గర వుంటే మంచివారము, విభేదిస్తే చెడ్డవారిమా అని ప్రశ్నించారు. తమ ఓటు బ్యాంకు కొల్లగొట్టడం కుదరదని, తాము మంచి చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మునీర్, షరీఫ్, మహబూబ్ పీర్ పాల్గొన్నారు.

# పులివెందులలో అగ్నిమాపక వారోత్సవాలు





పులివెందుల ఏప్రిల్ 19 ప్రభాతవార్త :

పులివెందుల పట్టణంలోని లయోలా డిగ్రీ కాలేజ్ రోడ్డులో ఉన్న మారుతి హాస్పిటల్లో ఆదివారం అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో హాస్పిటల్లో పనిచేస్తున్న సిబ్బందికి అగ్ని ప్రమాదాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.ఈ సందర్భంగా ఫైర్ సిఐ సునీల్ , ఎస్సై రవీందర్ లు మాట్లాడుతూ హాస్పిటల్లో అగ్ని ప్రమాదాలు సంభవిం చడానికి ప్రధాన కారణాలు బ్యాటరీలు, ఇన్వర్టర్లు, ఎయిర్ కండిషనర్లు, అలాగే ఐసీయూ విభాగంలో ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్‌లు అని తెలిపారు. అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు భయపడకుండా, ప్రశాంతంగా ఉండి సురక్షిత మార్గాల్లో బయటపడాల్సిన అవసరాన్ని వివరించారు. అలాగే ఫైర్ ఎక్స్టింగ్విషర్‌ను ఎలా వినియోగించాలో ప్రదర్శన ద్వారా సిబ్బందికి చూపించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చక్రపాణి మరియు హాస్పిటల్ సిబ్బంది, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ పి. సునీల్ కుమార్ మరియు వారి సిబ్బంది పాల్గొన్నారు.ఈ కార్యక్రమం ద్వారా సిబ్బందిలో అగ్ని ప్రమాదాలపై అవగాహన పెరిగిందని నిర్వాహకులు తెలిపారు.

# శ్రీ జాంబవంత నగర్, కోదండ రామస్వామి ఆలయ నిర్మాణానికి 1,21,116 విరాళం





బద్వేల్ అర్బన్ ఏప్రిల్ ఏప్రిల్ 19 : ప్రభాతవార్త :

బద్వేల్ మున్సిపాలిటీ పరిధి శ్రీ జాంబవంత నగర్ నందు నిర్మిస్తున్న శ్రీ కోదండరామస్వామి దేవస్థానం నిర్మాణానికి కాలనీవాసులైన కీర్తిశేషులు దియ్యాల తిరుపాలు వీరి ధర్మపత్ని అచ్చమ్మ వీరి కుమారుడు కీర్తిశేషులు దియ్యాల గురువయ్య వీరి ధర్మపత్ని సుశీలమ్మల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు 1,21,116/ విరాళాన్ని ఆలయ నిర్మాణ అభివృద్ధి కమిటీ సభ్యులు వల్లంకొండు వెంకటరమణ, చాటకొండు వెంకట నాగేశ్వరరావులకు వారి కుటుంబ సభ్యులైన దియ్యాల వాసు వీరి సతీమణి శివలక్ష్మి చేతులమీదుగా అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ అభివృద్ధి కమిటీ సభ్యులు మరియు కాలనీవాసులు మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి కాలనీవాసులు ముందుకు వచ్చి విరాళం అందించినందుకు కుటుంబానికి శ్రీరామచంద్రుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆశిస్తూ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు నాగేంద్రబాబు, హరి, శివ, శ్రీనివాసులు, చిన్నరాజు, వెంకటేశ్వర్లు, మనోజ్, సుధాకర్, సునీల్ పాల్గొన్నారు.

# ఎపి రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం జనరల్ బాడీ సమావేశంలో పాల్గొన్న ప్రొద్దుటూరు మాజీ సైనికులు

ప్రొద్దుటూరు అర్బన్, ఏప్రిల్ 19 ప్రభాత వార్త



ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం జనరల్ బాడీ సమావేశం బాపట్ల పట్టణం శ్రీ అన్నం సతీశ్ ప్రభాకర్ కాపు కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి సంఘ అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు, రాష్ట్ర నలుమూలల నుండి సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షులు మాజీ సైనికులు, వీర వనితలు పాల్గొన్నారు. ఈ సమావేశానికి డిఫెన్స్ ఎక్స్ సర్వీస్ మెన్ అసోసియేషన్ ప్రొద్దుటూరు డివిజన్ నుండి అధ్యక్షులు నేట్ల బాల వీరా రెడ్డి, సెక్రటరీ శంకర్ రెడ్డి, ట్రెజరర్ సాంబశివ రెడ్డి మెంబర్ సింగం శివారెడ్డి తదితరులు పాల్గొని అమర వీరులకు నివాళులు అర్పించిన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మాజీ సైనికుల సమస్యల గురించి సమావేశంలో క్షుణ్ణంగా పరిశీలించి చర్చించారు.

# గురువులను ప్రోత్సహించేందుకు సన్మానం



రాజంపేట ఏప్రిల్ 19 ప్రభాత వార్త

నిస్వార్థంతో విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తూ ఇతర ఉపాధ్యాయులకు స్ఫూర్తిగా నిలిచే గురువులను సన్మానం చేయడానికి ప్రధాన కారణం ప్రేరణ కల్పించేందుకేనని రాజంపేట ఏకలవ్య ఫౌండేషన్ ట్రస్టీ సాయి లక్ష్మి అన్నారు. ఆదివారం స్థానిక ఏబిచంద్రారెడ్డి గార్డెన్స్ లో నిర్వహించిన ,ఏకలవ్య ఫౌండేషన్ విద్యా వాహిని కార్యక్రమంలో నిస్వార్థ సేవలు అందిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులకి సన్మాన కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ నాగయ్య హాజరయ్యారు. ఏకలవ్య ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వేణుగోపాల్ రెడ్డి , మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకత నైపుణ్యాన్ని వెలికితీయడానికి విద్యావాహిని కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలియజేశారు. అలాగే రాజంపేట ఏకలవ్య ఫౌండేషన్ ట్రస్టీ సాయి లక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుతం ఈ విద్యా వాహిని కార్యక్రమం లో 20 ప్రభుత్వ పాఠశాలలో ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఇంకా మరి కొన్ని పాఠశాలలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కడప ట్రస్టీ చలపతి , ఏకలవ్య ఫౌండేషన్ డైరెక్టర్ మధుకర్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలి



వేంపల్లి ఏప్రిల్ 19 ప్రభాతవార్త

ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కి శస్త్ర చికిత్స అనంతరం తీవ్ర అస్వస్థకు గురయ్యారు అని ఆయన త్వరగా కోలుకోవాలని ఢా. హరీష్ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ.. కొద్ది నెలలుగా ఆరోగ్యపరంగా ఇబ్బంది పడుతున్నారని, వ్యక్తిగత వైద్యుల సలహాతో ఆసుపత్రికి వెళ్లారు అని అన్నారు . ఆస్పత్రి సిబ్బంది ఎం.ఆర్.ఐ పరీక్షల అనంతరం శస్త్ర చికిత్స చేశారు అని పది రోజులపాటు విశ్రాంతి అవసరమని ఆ తర్వాత ఆయన అధికారిక కార్యక్రమంలో నేరుగా పాల్గొనవచ్చునని డాక్టర్లు తెలిపారు అని అన్నారు . దీర్ఘకాలంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందని, మా జనసేనాని కి ఇలా జరగడం ఏంటని చాలా బాధాకరమైన మనసుతో విచారం వ్యక్తం చేశారు . డిప్యూటీ సీఎం ఆరోగ్యం త్వరగా కోలుకోవాలని, ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలలో వీలైనంత తొందరగా పాల్గొనాలని, ఆయన పాల్గొనకపోతే చాలా మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. గండి దేవస్థానంలోని ఆంజనేయస్వామిని పవన్ కళ్యాణ్ గోత్ర నామాలతో మన స్ఫూర్తిగా ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ కార్యకర్తలు సుధీర్ రెడ్డి, దేవ,శ్యామ్,ఇడుపులపాయ జయచంద్ర, థామస్,అంజి తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్ జగన్ మూడు రోజుల పర్యటన

పులివెందుల, ఏప్రిల్ 19 , ప్రభాత వార్త :

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మూడు రోజుల పర్యటనలో భాగంగా బెంగళూరు నుంచి వైఎస్సార్ జిల్లాకు రానున్నారు. ఏప్రిల్ 21 నుండి 23 వరకు జరిగే ఈ పర్యటనలో పులివెందులలో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఏప్రిల్ 21న మధ్యాహ్నం బెంగళూరులోని యెలహంక నివాసం నుంచి బయలుదేరి జక్కూర్ విమానాశ్రయానికి చేరుకుని, అక్కడి నుంచి హెలికాప్టర్ ద్వారా పులివెందుల సమీపంలోని భాకరాపురం హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అనంతరం క్యాంప్ కార్యాలయానికి వెళ్లి సాయంత్రం వరకు వివిధ కార్యక్రమాలలో పాల్గొంటారు. రాత్రికి భాకరాపురంలోని నివాసంలో విశ్రాంతి తీసుకుంటారు.ఏప్రిల్ 22న ఉదయం లింగాల మండలం ఇప్పట్ల గ్రామానికి వెళ్లి మృతి చెందిన సుధాకర్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. అనంతరం పులివెందుల క్యాంప్ కార్యా లయంలో సమావేశా లు, ఇతర కార్యక్రమాలు నిర్వహించి రాత్రికి తిరిగి నివాసానికి చేరుకుంటారు.ఏప్రిల్ 23న ఉదయం భాకరాపురం నుంచి హెలిప్యాడ్‌కు చేరుకుని హెలికాప్టర్ ద్వారా బెంగళూరుకు బయలుదేరి, అక్కడి నుంచి యెలహంక నివాసానికి చేరుకుంటారు.

# అమెరికా ఇజ్రాయిల్ దేశాలతో ప్రపంచ మానవాళికి ప్రమాదం

## ఇరాన్ పై యుద్ధంలో భారత ప్రభుత్వ వైఖరి సరైనది కాదు
## పశ్చిమాసియాలో శాంతి నెలకోల్పకపోతే భారత్ కు తీవ్ర నష్టం
## యుద్ధ ఎవరికోసం సదస్సులో వక్తలు



ప్రొద్దుటూరు ఏప్రిల్ 19 ప్రభాతవార్త

అమెరికా ఇజ్రాయిల్ దేశాల యుద్ధోన్మాదులతో ప్రపంచ మానవాళికి పెనుముప్పు పొంచి ఉందని ఇరాన్ పై సాగిస్తున్న దురాక్రమణ యుద్ధాన్ని భారత ప్రజలు పెద్ద ఎత్తున నిరసించి ఉద్యమించాలని లేకుంటే దేశంలో ఆర్థిక సంక్షోభంతో పాటు అన్ని రకాల వస్తువుల ధరలు పెరిగిపోతాయని ప్రజలపై పెద్ద ఎత్తున భారం పడుతుందని వక్తలు ఉద్ఘాటించారు. ఆదివారం యుద్ధ వ్యతిరేక వేదిక ఆధ్వర్యంలో పద్మశాలియ కళ్యాణమండపంలో యుద్ధం ఎవరి కోసం అనే సదస్సు నిర్వహించారు. పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు లెక్చరర్ సురేష్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆల్ ఇండియా ప్రోగ్రెసి ఫోరం జాతీయ నాయకులు కాలమిస్టు బుడ్డిగ జమీందార్ మాట్లాడుతూ ఇరాన్ పై అమెరికా ఇజ్రాయిల్ సాగిస్తున్న దురాక్రమణ యుద్ధం మీద భారత ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరి సరైనది కాదన్నారు. విరసం వరలక్ష్మి మాట్లాడుతూ అలీన విధానానికి తూట్లు పొడిచి భారత్ ఈ యుద్ధం లో అమెరికా ఇజ్రాయిల్ పక్షాన నిలబడ్డం చారిత్రక తప్పిదమన్నారు. ఎంపీజే రాష్ట్ర కార్యదర్శి సలీం మాట్లాడుతూ పశ్చిమాసియాలో శాంతి నెలకొనకపోతే భారతదేశంలో పాటు అనేక దేశాలలో సంక్షోభాలు ఏర్పడతాయన్నారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ అడ్వకేట్ క్రాంతి చైతన్య మాట్లాడుతూ హార్మోజును మూసేస్తే భారత్లో ఎలాంటి ప్రభావాలు పడుతున్నాయో ప్రత్యక్షంగా పెట్రోల్ గ్యాస్ ధరలు పెరగడం చూస్తున్న భారత ప్రజలు మేలుకోలేకపోవడం దారుణమన్నారు. ఇరాన్ పై సాగుతున్న యుద్ధాన్ని మతపరమైన కోణంలో చూడరాదన్నారు. వెనుజులా ముస్లిం దేశం కాకున్నా ఆ దేశ అధ్యక్షున్ని చమురు నిక్షేపాల కోసం అమెరికా బంధించిందన్నారు.. ఇరాన్ లో ఉన్న ఆయిల్ సంపదను దోచుకోవడానికి ఆ దేశ అధ్యక్షుడు ఖమేనిని అమెరికా ఇజ్రాయిల్ బాంబులు వేసి హత్య చేశాయన్నారు.ఐక్యరాజ్యసమితి ,అంతర్జాతీయ న్యాయ స్థానాలు తో పాటు ప్రపంచ దేశాల మోనం చాలా వినాశనానికి దారితీస్తుందన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రధాని మోదీ అమెరికా ఇజ్రాయిల్ దేశాలతో స్నేహం దేశానికి చాలా ప్రమాదకరమన్నారు. ఆంధ్ర రాష్ట్రంలోబిజెపి ( బాబు, జగన్ ,పవన్) పరిపాలన సాగుతున్నదన్నారు. మోడీ జపం తప్ప స్వతంత్రంగా వెన్నుముక గల నాయకులు ఈ మూడు పార్టీలో లేరన్నారు. ప్రజా కళామండలి కళాకారులు ఆలపించిన గేయాలు సభికులను ఉత్తేజపరిచాయి. కార్యక్రమంలో సిపిఐ రామయ్య, కాంగ్రెస్ నజీర్, జెవివి తవ్వ సురేష్, ఐద్వా ముంతాజ్, సి ఎం ఎస్ పద్మ, పీకేఎస్ నాగేంద్ర శ్రీనివాసులు రెడ్డి, ఆర్ఎంఎస్ లక్ష్మీదేవి, మాజీ ఎస్టియు నేత రషీద్, జమాతే ఇస్లామిక్ హింద్ గౌస్మొద్దీన్ షఫీ, రెహనా, అడ్వకేట్ హరిత, జాతీయ బీసీ సంక్షేమ సంఘం కృష్ణయ్య యాదవ్, నాగమల్ల శంకర్, దేవానంద్, రచయిత దాదా హయత్, ఎంపీజే ఆయూబ్ ,వ్యవసాయ కార్మిక సంఘం అన్వేష్, డేవిడ్, జాతీయ జేవివి పల్లవులు రమణ తదితరులు పాల్గొన్నారు.